నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 20 జనవరి 2025 | KARIMNAGAR

కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశాం

- కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె
- నీళ్లు లేక పంట పొలాలు ఎండుతున్నయ్
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో చెర్లపల్లి(ఎన్) గ్రామ రైతుల గోడు
- ఎండుతున్న పొలాల పరిశీలన

చెర్లపల్లి(ఎన్) వద్ద రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, జనవరి 19: ''కేసీఆర్ పాలనలో టైమ్‌కు నీళ్లచ్చినయ్.. ఆకాశం వైపు చూడకుండా పంటలు సాగు చేసినం.. టైమ్‌కు రైతుబంధు వచ్చింది.. 24 గంటల కరెంటు ఉంది.. కష్టం లేకుండా ఎరువులు దొరికినయ్.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేశాం.. రుణమాఫీ కాలేదు.. రైతు భరోసా ఎగవెట్టిన్రు.. కరెంటు కోతలతో మోటర్లు కాలిపోతున్నయి.. పంట లు ఎండిపోతున్నయ్..'' అంటూ గంగాధర మండలంలోని చెర్లపల్లి(ఎన్) గ్రామ రైతులు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద చెర్లపల్లి(ఎన్) గ్రామ పరిధిలో నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడగా నాటి కేసీఆర్ పాలన.. నేటి రేవంత్‌రెడ్డి పాలన గురించి వారు మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్‌కు సకాలంలో ఎల్లంపల్లి జలాలను విడుదల చేయకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వారం క్రితమే నీటిని విడుదల చేస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేశారని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సత్యంకు క్షీరాభిషేకాలు చేశారని గుర్తు చేశారు. సరైన సమయంలో నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు కంకణాల విజేందర్‌రెడ్డి, దూలం శంకర్‌గౌడ్, గడ్డం స్వామి, పొట్టల కనకయ్య, పొన్నం రాములు, గర్వందుల పరశురాములు వడ్లూరి ఆదిమల్లు, దోమకొండ మల్లయ్య, తదితరులు ఉన్నారు.

• ఎస్సారెస్పీ నీళ్లు వీధుల పాలు

సాగు, తాగుకు ఆదరువుగా మారాల్సిన ఎస్సారెస్పీ జలాలు వీధుల పాలవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణలోపంతో వృథాగా పోతున్నాయి. ఇండ్లు, పొలాలను చుట్టుముట్టేస్తున్నాయి. ఇందుకు శంకరపట్నం మండలంలోని అంబాల్‌పూర్, కేశవపట్నం గ్రామాల్లో నీరు రోడ్లపైకి రావడమే నిదర్శనంగా నిలుస్తున్నది. అంబాల్‌పూర్ శివారులోని ఎస్సారెస్పీ డీబీఎం-13 ఉప కాలువ ఎస్కేప్ షట్టర్లు అవసరానికి మించి పైకి ఎత్తడం వల్లే నీరు దిగువనున్న పొలాలను ముంచెత్తుతోంది. దాదాపు 50 ఎకరాల్లో ఉన్న పొలాల గుండా వరద ప్రవహిస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇక కేశవపట్నం ఎత్తుగడ్డ వద్ద వరద నీరు పలువురి ఇండ్ల చుట్టూ చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, లేదంటే రైతులు, కాలనీవాసులందరం ఏకమై ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు. **-శంకరపట్నం, జనవరి 19**

శంకరపట్నం: కేశవపట్నంలో రోడ్డుపై ప్రవహిస్తూ ఇండ్లను చుట్టుముట్టిన వరద నీరు

అంతర్యుద్ధం

ఇందిరమ్మ కమిటీలకు ఇప్పటివరకు పడని ఆమోద ముద్ర

- జగిత్యాల జిల్లాలో భర్తీకాని నామినేటెడ్ పోస్టులు
- ప్రజాప్రతినిధుల మధ్య ఆధిపత్యపోరు
- తన కులం వారే అధికారులుగా రావాలంటున్న ఒక ప్రజాప్రతినిధి
- సీనియర్ నాయకుడి సన్నిహిత ఉద్యోగులందరికీ మంగళం
- అయోమయంలో పాలనా వ్యవస్థ



జగిత్యాల జిల్లాలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుల మధ్య అంతర్యుద్ధం నెలకొన్నది. తమ మాట చెల్లుబడి కావాలంటూ పట్టుబడుతుండడంతో పాలనపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్గతంగా నెలకొన్న ఆధిపత్య పోరుతో కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, ఇటు ప్రభుత్వ అధికారులు, అటు ప్రజలు.. ఇలా అన్ని వర్గాలు వారు సమస్యల పాలవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధుల మధ్య చెలిమి, అనుబంధం పైకి కనిపిస్తున్నంత సఖ్యంగా లేవని, అవన్నీ జనాలకు చూడడానికి మాత్రమేనన్న విమర్శలు వస్తున్నాయి.

జగిత్యాల, జనవరి 19(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుతో పాలనా వ్యవస్థ అయోమయం.. జగన్నాథం అన్నట్లుగా మారింది. అంతర్గతంగా నామినేటెడ్ పోస్టుల నుంచి మొదలు కొని, ప్రభుత్వ ఉద్యోగుల పోస్టింగులు, ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపిక వరకు ఇబ్బందులే ఎదురువుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామినేటెడ్ పోస్టుల భర్తీ సైతం నిలిచిపోయిందని, అధికారుల బదిలీలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని ఆ పార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి.

ఇందిరమ్మ కమిటీలకు పడని ఆమోద ముద్ర

రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. గతేడాది అక్టోబర్ 11న జీవో 33 జారీ చేసింది. ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం ఇస్తామని, లబ్ధిదారుల ఎంపిక ఇందిరమ్మ కమిటీలు చేస్తాయని ప్రకటించింది. గ్రామ స్థాయిలో సర్పంచ్/స్పెషల్ ఆఫీసర్ ఇందిరమ్మ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉంటారని, గ్రామ కార్యదర్శి కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో వార్డు కౌన్సిలర్లు/వార్డు అధికారులు ఉంటారని తెలిపారు. గ్రామం నుంచి ముగ్గురు సభ్యులను ఎంపిక చేయాలని, అందులో జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉండాలని నిర్ణయించారు. కమిటీలో ఖచ్చితంగా 50 శాతం మహిళలు ఉండాలని నిబంధనలు పెట్టారు. జగిత్యాల జిల్లాలో 514 ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, సభ్యుల ఎంపిక విషయంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచి, కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేకు, ఆ పార్టీలో సీనియర్‌గా ఉన్న ఎమ్మెల్సీ వర్గీయుల మధ్య సభ్యుల ఎంపిక విషయంలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయి. దీంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో రెండేసి జాబితాలు తయారై, అధికారులకు నివేదించబడ్డాయి. కోరుట్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఒక జాబితా నివేదించగా, కాంగ్రెస్ ఇన్‌చార్జి మరో జాబితాను అధికారులకు అందజేశారు. ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు చెందిన వారిలోనే పోరపెచ్చులు రావడంతో ఇందిరమ్మ సభ్యుల జాబితా తయారీలో సమస్యలు ఏర్పడ్డాయి. ఇక చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మండలాల్లోనూ సమస్యలు వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు ఇందిరమ్మ కమిటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆమోదముద్ర వేయలేదు. ఫలితంగా అటు ఇందిరమ్మ కమిటీల జాబితాల్లో పేరున్న వారు, ఇటు ప్రభుత్వ అధికారులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. జిల్లాలో 2,03,011 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, వారందరి గురించి సర్వే నిర్వహించి, వివరాలు ఆన్‌లైన్ చేశారు. ఈ రోజు లేదా రేపో 360 డిగ్రీల యాప్ ఆధారంగా గ్రామాలు, వార్డుల వారీగా లబ్ధిదారుల జాబితా ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. జాబితా ప్రకటన తర్వాత ఈ నెల 21 నుంచి 24 తేదీల మధ్య గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు సమావేశాలు నిర్వహించి, తొలి 3500ల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అయితే, ఇంత వరకు ఇందిరమ్మ కమిటీలకే ఆమోదముద్ర పడకపోవడంతో గ్రామ సభలు ఎలా నిర్వహించాలి?, లబ్ధిదారులను ఎలా ఎంపిక చేయాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకుల మధ్య సమన్వయం లేక ఇష్టారాజ్యంగా జాబితాలు సమర్పించడం వల్లనే కమిటీల ఎంపిక జరగడం లేదని అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నియామకంలోనూ ఆధిపత్య పోరే

జిల్లాలోని ప్రభుత్వ అధికారులకు పోస్టింగులు ఇవ్వడం, బదిలీలు చేసే విషయంలోనూ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నెలకొందన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో జరిగిన కొన్ని బదిలీలు, పోస్టింగులు అందరినీ విస్మయానికి గురి చేశాయి. జిల్లాకు కొన్ని నెలల క్రితం బదిలీపై వచ్చి, మూడు నాలుగు నెలలు సైతం పనిచేయకముందే ఒక జిల్లా ఉన్నతాధికారి బదిలీ అయ్యారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకున్నా సదరు అధికారి బదిలీ కావడం అందరినీ విస్మయానికి గురి చేసింది. తనను ఎందుకు బదిలీ చేశారో అర్థం కాక సదరు అధికారి ఇతర ఉద్యోగుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏడాది క్రితం వరకు ఇదే జిల్లాలో పనిచేసి మరో జిల్లాకు బదిలీపై వెళ్లిన ఉద్యోగి ఐదారు నెలల వ్యవధిలోనే బదిలీపై తిరిగి వచ్చారు. ఈ బదిలీ అందరినీ ఆశ్చర్యపరిచింది. అవినీతి ఆరోపణలు ముఖ్యంగా బియ్యం లెవీ విషయంలో ఉన్న సదరు అధికారి తిరిగి రావడం అందరికీ సందేహాన్ని కలిగించింది. బదిలీ ఉత్తర్వులు తీసుకొని సదరు అధికారి విధుల్లో చేరేందుకు కార్యాలయానికి రాగా, జిల్లాకు చెందిన ఒక కీలక ప్రజాప్రతినిధి సదరు అధికారిని విధుల్లోకి తీసుకోవద్దని అడ్డు చెప్పడంతో కొంత సేపు ఆయోమయ పరిస్థితి నెలకొన్నట్లు ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. చివరకు బదిలీపై వచ్చిన అధికారి రాజధాని స్థాయిలో ఉన్నతాధికారులు, మంత్రుల స్థాయి ప్రజాప్రతినిధులతో సంప్రదించి, జిల్లా కీలక ప్రజాప్రతినిధితో పాటు మరో ప్రజాప్రతినిధి, పెద్ద మొత్తంలో నజరానా ముట్టజెప్పడంతో విధుల్లో చేర్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి తన మాట వినడం లేదని, నజరానాలు సమర్పించడం లేదన్న మిషతో కీలక విభాగంలో పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారిని బదిలీ చేయించి మరో అధికారిని తెచ్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, జిల్లాలో రాజకీయ సంచలనాలకు కేంద్రమవుతున్న ప్రజాప్రతినిధి తన పరిధిలో అన్ని కీలక శాఖలకు తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే ఉండాలన్న లక్ష్యంతో తన వారినే భర్తీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో సీనియర్ నాయకుడు, ప్రజాప్రతినిధికి మద్దతు పలికే ఉద్యోగులు, సన్నిహితులుగా గుర్తింపు పొందిన ఉద్యోగులందరినీ జిల్లా నుంచి వెళ్లగొట్టేందుకు పలు బదిలీలు చేయించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాడ లేని మార్కెట్ కమిటీల నియామకం

జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రెండు మార్కెట్ కమిటీలు ఉండగా, రెండింటికి పాలకవర్గాలను ఇంత వరకు నియమించలేదు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో రాజకీయాలన్నీ తారుమారు అయిపోయాయి. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతో పాటు, పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ఏడాది క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడ్డ అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలిపెట్టారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి రెండు సీజన్లు పూర్తయి, మూడో సీజన్ ప్రారంభమైనా ఇంకా కమిటీల ఏర్పాటు జరగకపోవడంపై రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రంథాలయ చైర్మన్ ఎంపికలోనూ జాప్యం

జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంపిక విషయంలోనూ తీవ్రమైన జాప్యం నెలకొన్నది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని దళిత వర్గానికి చెందిన సీనియర్ కార్యకర్తకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, సదరు దళిత నాయకుడికి పదవి ఇవ్వడం ఇష్టంలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును ప్రతిపాదిస్తూ సిఫారస్ చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలోనూ ప్రతిష్టంభన ఏర్పడింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి భర్తీ విషయంలో చక్రం తిప్పిన జగిత్యాల ఎమ్మెల్యే తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి ఎమ్మెల్యే, ధర్మపురి ఎమ్మెల్యేను ఒప్పించి, ఎమ్మెల్యే ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గమైన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్లుగా సమాచారం. ఏడాది గడిచినా జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టు భర్తీ కాకపోవడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఇష్టారాజ్యంగా పాలన సాగుతుండడంతో అటు ప్రజలు, ఇటు అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.

కేసీఆర్‌ను కలిసిన చందర్

గోదావరిఖని, జనవరి 19 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వారికి మొక్కను బహూకరించారు.

మోసపోయి.. గోసపడుతున్నరు

- కాంగ్రెస్ సర్కారుకు ప్రజల నుంచి గుణపాఠం తప్పదు
- నియోజకవర్గంలో కమీషన్ల పాలన
- అవినీతిపరుల జాబితాలో 'కవ్వంపల్లి'కి రాష్ట్రంలోనే రెండోస్థానం
- ఏడాది కాలంలో ఒరగబెట్టింది శూన్యం
- స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫైర్ • కొత్తపల్లిలో తిమ్మాపూర్ మండల విస్తృతస్థాయి సమావేశం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్/తిమ్మాపూర్ రూరల్, జనవరి19: ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పిన మాయమాటలకు ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగురుతుందని, బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ధీమా వ్యక్తం చేశారు. మానకొండూర్ నియోజకవర్గంలో కమీషన్ల పాలనపై ప్రజలు ప్రతాపం చూపుతారని, మోసకారి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఆదివారం కొత్తపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడారు. రాష్ట్రమంతా ఒక లెక్క ఉంటే మానకొండూర్‌లో ఒక లెక్క ఉందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి కమీషన్ల కక్కుర్తితో నియోజకవర్గ పేరు ప్రతిష్టలను మంటలో కలుపుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన అంతర్గత సర్వేలో అత్యంత అవినీతిపరుల జాబితాలో రాష్ట్రంలోని 119 మంది ఎమ్మెల్యేల్లో రెండో స్థానంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. వారి సర్వే ప్రకారం 25 శాతం మంది ఇష్టపడితే, 75 శాతం మంది కవ్వంపల్లిని ఇష్టపడడం లేదని చెప్పారు. రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి, నియోజకవర్గాన్ని కవ్వంపల్లి దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ నీతిమంతులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పు చేసిండని కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాపాలనలో చేసిన దరఖాస్తులు ఎక్కడని, సమగ్ర సర్వే ఏమైందని ప్రశ్నించారు.

ఎన్నో చేశాను.. నువ్వేం చేశావ్..?

మండలానికి, నియోజకవర్గానికి తాను ఎంతో చేశానని, ఎమ్మెల్యే సత్యనారాయణ ఈ ఏడాది పాలనలో ఏం చేశాడో చెప్పాలని రసమయి ప్రశ్నించారు. కమీషన్లు తీసుకోవడం తప్ప ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. ఒకప్పుడు మొగిలిపాలెం బెల్ట్‌లో యాసంగి పంటలు పండకపోయేవని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత భూమికి బరువయ్యేలా వడ్లు పండేలా నీళ్లు తీసుకు వచ్చానన్నారు.

రేషన్ కార్డుల పేరుతో దగా..

కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల పేరుతో ప్రజలను ఆగం చేస్తున్నదని రసమయి విమర్శించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి పది శాతం పేర్లు రాలేదని, ఆ పార్టీ నాయకులు క్యాంపు ఆఫీసులో కూర్చుని సెలెక్ట్ చేశారని దుయ్యబట్టారు. ఒక గ్రామంలో వందల మంది దరఖాస్తు చేసుకుంటే 55 మంది పేర్లు వచ్చాయని, వాటిని కూడా అధికారులు సర్వే చేసి కొన్ని తొలగిస్తారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రశ్నించడం వల్లే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగిస్తామని ప్రకటించారని చెప్పారు. అన్ని పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికం అయినప్పుడు రేషన్‌కార్డులు పూర్తిస్థాయిలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

రేణికుంటలో రేవంత్ హామీ ఏమైంది..

ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రేణికుంట గ్రామంలో పెద్ద మీటింగ్ పెట్టి రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తామన్నారని, ఎవరికి వచ్చినయ్..? అని రసమయి ప్రశ్నించారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు అన్నారని, అది కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు నియోజకవర్గానికి 3500 ఇస్తున్నట్లు ప్రకటించారని, ఇంటికి రూ.50 వేలు ముడితేనే ఇల్లు మంజూరైతున్నదని ఆరోపించారు.

మానేరును తోడేస్తరు

నీళ్లివ్వడం చేతకాని సర్కారు, ఉన్న నీటిని ఓడగొట్టి ఇసుకను తోడేందుకు మంత్రి పొంగులేటి పన్నాగం పన్నాడని, ప్రభుత్వం ఆల్రెడీ కాంట్రాక్టులు ఇచ్చేసిందని రసమయి ఆరోపించారు. ఎల్ఎండీతోపాటు మిడ్‌మానేరును పూడిక పేరుతో ఇసుకను దోస్తారని చెప్పారు. పొంగులేటి కాలువలు తవ్వితే తెగిపోతున్నాయని, డబుల్ బెడ్రూం ఇండ్ల కాంట్రాక్టు ఇస్తే రామకృష్ణకాలనీలో నిలిపివేసి వెళ్లిపోయాడని విమర్శించారు.

ప్రశ్నించండి.. చర్చించండి

కాంగ్రెస్ సర్కారు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు ఏ భయం లేకుండా ప్రశ్నించాలని, మోసాలపై ప్రజల్లో చర్చ పెట్టాలని శ్రేణులకు రసమయి పిలుపునిచ్చారు. గతంలో ఎలా చేశాం.. ఇప్పుడెలా ఉందో..? వివరంగా చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ పాత రోజులు వచ్చాయని, వేరే రాష్ట్రాలకు బతకపోయే పరిస్థితి రానున్నదని చెప్పారు. తాను ఇక్కడే ఉంటానని, త్వరలోనే తొలిపొద్దు కార్యక్రమం చేపట్టి పల్లెలకు వస్తానని పేర్కొన్నారు. ఎవరూ ఆగం కావద్దని, ఆగం చేయాలని సూచించారు. కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల్లో అభ్యర్థులను గెలిపించుకుందామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మనమే గెలవబోతున్నామని, పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ పిలుపునిచ్చారు. కాగా, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోస్టులు పెట్టిన పాపానికి కేసులపాలైన మన్నెంపల్లికి చెందిన సుదగోని సదయ్య లాంటి కార్యకర్తలకు తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలాధ్యక్షుడు రావుల రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉల్లెంగుల పద్మ ఏకానందం, సొసైటీ చైర్మన్లు గుజ్జుల రవీందర్‌రెడ్డి, సింగిరెడ్డి స్వామిరెడ్డి, రాధాకిషన్‌రావు, నాయకులు బోయిని కొమురయ్య, యాదగిరి వెంకటేశ్వర్‌రావు, మాతంగి లక్ష్మణ్, మీసాల అంజయ్య, పాశం అశోక్‌రెడ్డి, పొన్నం అనిల్‌గౌడ్, సాయిళ్ల కొమురయ్య పాల్గొన్నారు.

కేసులకు భయపడద్దు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులు పెడుతున్నారు. కేసులతో ఎవరికీ ఏమీ కాదు. కేసు పెట్టామని పోలీసులు పిలిస్తే దొరలాగా వెళ్లి నోటీసులు తీసుకోండి. మనమేం దేశద్రోహం, నేరాలు చేయడం లేదు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పెట్టే కేసులతో అయ్యేది లేదు.. పోయేది లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టండి. పార్టీతో పాటు ప్రజల్లో పేరుంటేనే ఎన్నికల్లో గెలవగలుతాం. స్థానిక ఎన్నికలు చాలా క్లిష్టమైనవి. వ్యక్తిత్వాన్ని బట్టే ఓట్లు వేస్తారు. పార్టీని బలోపేతం చేసుకుంటూ బలంగా ఉండాలి. గెలిచినప్పుడు ఎలా ఉన్నామో..? ఇప్పుడూ అలాగే ఉన్నాం. ఎక్కడికైనా వెళ్తే ప్రజలు మనల్నే గౌరవిస్తున్నారు.

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

హాజరైన కార్యకర్తలు, నాయకులు

• కాలువ ఇలా.. నీళ్లు పోయేదెలా..?

కొలనూర్‌లో చెట్లతో నిండిపోయి ఉనికి కోల్పోయిన ఎస్సారెస్పీ కాల్వ

ఎస్సారెస్పీ ఉప కాలువలు అధ్వానంగా మారాయి. దశాబ్దాలుగా రైతన్నకు భరోసాగా నిలిచి, సేద్యానికి కల్పవల్లిగా మారిన కెనాళ్లు చెత్తా, చెదారం, పూడికతో నిండి ఆనవాళ్లు కోల్పోయాయి. ఇందుకు ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఓదెల మండలంలో ఉన్న ఉప కాలువల పరిస్థితే నిదర్శనం. దాదాపు వందలాది ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఈ యాసంగిలో చివరికి చుక్క నీరు కూడా అందించలేని దుస్థితిలోకి వెళ్లిపోగా, సాగు గట్టెక్కేదెలా..? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించాలని కోరుతున్నారు. **-ఓదెల, జనవరి 19**

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 19 : పోటీ పరీక్షలకు హాజరయ్యే వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎం అనిల్ ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ రంగ సంస్థలతో పాటు ఇతర రంగాల్లోని సంస్థల్లో ఉద్యోగావకాశాలు సాధించేందుకు తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో అభ్యర్థులకు తర్ఫీదునివ్వనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 9 వరకు http;\\tgbcstudycircles.c